
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 8 ఆగస్టు 2024



నిత్య అన్నదాన సత్రంలో నీరు చేరిన దృశ్యం

వరుణుడి కరుణ



పెనుబల్లి మండలంలో అలుగుపారుతున్న రాతోని చెరువు

తెరపిలేని వాన

- రెండో రోజూ వరుణుడి జోరు
- ప్రాజెక్టులు, చెరువులకు జలకళ
- పొంగుతున్న వాగులు, వంకలు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పొలాలు
- పలుచోట్ల రోడ్లపైకి నీరు
- సత్తుపల్లి మండలం గంగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం

ఖమ్మం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుణుడి కరుణతో జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా అంతటా జలకళ కనిపిస్తోంది. నీళ్లతో చెరువులు, ప్రాజెక్టులు, ఏర్లు కళకళలాడుతున్నాయి. మున్నేరుతోపాటు పలు ఏర్లన్నీ పరవళ్లు తొక్కుతున్నాయి. రైతులో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారంతోపాటు బుధవారం కూడా జిల్లాలోని పలు మండలాల్లో భారీవర్షం కురిసింది. దీంతో పంట పొలాలకు నీరు రావడంతోపాటు గ్రామాల్లో వాగులు పొంగడంతో రోడ్లపైకి నీరురావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సత్తుపల్లి మండలం గంగారంలో అత్యధికంగా 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో భారీవర్షం పడింది. దీంతో చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బుధవారం ఉదయానికి జిల్లాలో 3.1సెం.మీ. సగటు వర్షపాతం నమోదు కాగా, వేంసూరు మండలంలో 6.6. సెం.మీ., పెనుబల్లిలో 5.9. సెం.మీ., ఖమ్మం అర్బన్‌లో 5.5. సెం.మీ. వర్షపాతం పడింది. మిగిలిన మండలాల్లో కూడా 2 నుంచి 5.సెం.మీ.లోపు వర్షపాతం కురిసింది. కిష్టారం-చెరుకుపల్లి మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్‌కాలనీలో రోడ్లపైకి భారీగా వరదనీరు చేరింది. సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట-దిబ్బగూడెం మధ్య రాకపోకలు నిలిచిపోగా.. పంటలు నీటమునిగాయి. రఘునాథపాలెం మండలం వీఆర్ బంజర-గరిడేపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కల్లూరు-లక్ష్మీపురం మధ్య చెరువు అలుగుపడడంతో నీరు రోడ్డుపైకి చేరింది. కొణిజర్ల మండలం పల్లిపాడు నుంచి గుబ్బగుర్తి మధ్య వాగుల్లో పొంగి రహదారిపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. మొత్తంమీద జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువుల ప్రాజెక్టుల్లో జలసందడి నెలకొంది. వైరా, లంకాసాగర్, బేతుపల్లి రిజర్వాయర్లలో వరద చేరడంతో సాధారణ నీటిమట్టానికి మించి ప్రవహిస్తున్నాయి. మరోవైపు పాలేరు జలాశయం నుంచి ఎడమకాల్వకు సాగునీరు నిమిత్తం నీరు వదిలారు.



జూలూరుపాడులో నీట మునిగిన పత్తి పంట

భద్రాద్రి జిల్లాలో పొంగిన వాగులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేని వర్షం కురిసింది. దాంతో వాగులు పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సాధారణ జనజీవనానికి ఆటంకం కలిగింది. ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడు ప్రాంతంలో అత్యధికంగా 7.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో 6సెం.మీ, లక్ష్మీదేవిపల్లి, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, దమ్మపేటలో 5.5 సెం.మీ, ములకలపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, అశ్వారావుపేట, ఆళ్లపల్లి ప్రాంతాల్లో 4.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. గుండాల, ఆళ్లపల్లి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద పెరిగింది. 21 వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం 404.25 అడుగులకు చేరింది. దాంతో నాలుగు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ముర్రేడు, గోధుమవాగులు సైతం పొంగి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భద్రాచలం ప్రాంతంలో కురిసిన వర్షానికి భద్రాద్రి రామాలయ పరిసర ప్రాంతాలు, నిత్య అన్నదానసత్రం, (మిగతా 6వ పేజీలో)



తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం వద్ద పొంగి ప్రవహిస్తున్న ఆకేరు

అయ్యో.. రామా!



భద్రాద్రి రామాలయం పరిసరాల్లో వర్షపు నీరు

భద్రాజలం

రెండు గంటల్లో 6 సెం.మీ. వర్షపాతం

- నీట మునిగిన రామాలయం పరిసరాలు, నిత్యన్నదాన సత్రం
- అధికారుల తీరుపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- మోటార్లతో తోడి వర్షపునీరు పోయేలా చర్యలు
- ధ్వంసమైన కుసుమ హరినాథబాబా కల్యాణ మండపం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, ఆగస్టు 7: భద్రాచలంలో బుధవారం రెండు గంటలపాటు భారీ వర్షం కురవడంతో రామాలయం పరిసరాలు, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం నడుంలోతు నీళ్లల్లో మునిగాయి. ఉచిత అన్నదానం నిర్వహించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా పులిహోర ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే చప్టా దిగువలోని చిరు వ్యాపారుల దుకాణాలు నీట మునిగాయి. రామాలయం పడమర మెట్ల వైపు నుంచి ఆలయంలోకి ప్రవేశించేందుకు భక్తులు తీవ్ర అవస్థలే పడ్డారు. కొంతమంది భక్తులు నడుం లోతు నీళ్లల్లోనే నడుచుకుంటూ వెళ్లారు. భద్రాద్రిలో మొత్తంగా రెండు గంటల పాటు ఆరు సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫలితంగానే ఊహించని రీతిలో ఒక్కసారిగా భారీ ఎత్తున వర్షపు నీరు లోతట్టు ప్రాంతమైన చప్టా దిగువ ప్రాంతంలోని విస్తా కాంప్లెక్సు స్లూయిస్ వద్దకు చేరడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

ధ్వంసమైన హరినాథబాబా కల్యాణ మండపం

భారీ వర్షాల నేపథ్యంలో రామాలయం సమీపంలో ఉన్న శతాబ్దకాలం నాటి కుసుమ హరినాథబాబా కల్యాణ మండపం ఒక వైపునకు ఒరిగింది. దీంతో ఆ పరిసరాల్లో ఉన్న ఇళ్ల యజమానులను వెంటనే బయటకు వెళ్లమని అధికారులు సూచించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టరు జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దారు శ్రీనివాసరావు, సీఐ సంజీవరావు, దేవస్థానం ఈఈ రవీందర్‌నాద్, కుసుమ హరినాథబాబా దేవస్థానం ఈవో సుదర్శన్, ఇతర అధికారులు ఐటీసీ సంస్థ సహకారంతో ఇళ్లవైపు ఒరిగిన కల్యాణ మండపాన్ని ఇనుప వైర్లు, పుల్లీల సహాయంతో కట్టారు. కాగా కల్యాణ మండపం సగానికి విరిగిపోయి అక్కడే పడిపోయింది. మిగిలిన పనులను గురువారం పూర్తి చేయనున్నారు.



కూలిన కుసుమ హరినాథబాబా కల్యాణమండపం

తుమ్మల ఆగ్రహం

రామాలయం పరిసరాలతోపాటు నిత్యాన్నదాన సత్రం భారీ వర్షంతో నీట మునిగిందని తెలియడంతో నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో మాట్లాడి సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించినట్టు సమాచారం. వర్షపు నీటిని వెంటనే మోటార్ల ద్వారా తోడి గోదావరిలోకి పంపాలని అధికారులకు సూచించారు. ఇదే క్రమంలో కుసుమ హరినాథబాబా కల్యాణ మండపం ఇళ్లపై ఒరిగిందనే విషయం తెలియడంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. దీంతో కలెక్టరు వెంటనే భద్రాచలం వచ్చి అధికారులతో పరిస్థితిని సమీక్షించి చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా హరినాథబాబా ఆలయంలో కల్యాణ మండపం ఒక వైపు ఒరిగిన విషయం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు భద్రాద్రి దేవస్థానం అధికారులు తీసుకెళ్లినట్లు సమాచారం.



భద్రాచలంలో నీట మునిగిన చిరువ్యాపారుల దుకాణాలు

శాశ్వత పరిష్కారం లేదా!?

- మరోసారి నీట మునిగిన రామాలయ పరిసరాలు, అన్నదాన సత్రం
- రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం
- భద్రాద్రివాసుల ఇక్కట్లు ఇక తీరవా?
- షటర్లు మూసివేయడంతో సమస్య ఏర్పడింది.. కలెక్టర్ జితేష్ వి పాటిల్ 6

రైతుల అభివృద్ధే ధ్యేయం

- మాకు ప్రజాదీవెనలతో పాటు దేవతల దీవెనలూ ఉన్నాయి
- రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి
- పాలేరు జలాశయం నుంచి సాగర్ జలాల విడుదల



కూసుమంచి, ఆగస్టు 7: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాదీవెనలతోపాటు దేవతల దీవెనలు ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంత్రి.. స్విచ్చాన్ చేసి పాలేరు జలాశయం నుంచి రెండోజోన్ ఆయకట్టుకు సాగర్ జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారె, చీర సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేవుళ్లు దీవించబట్టే ఇందిరమ్మ రాజ్యంలో ప్రాజెక్టులకు సరిపడా నీరు చేరిందని పేర్కొన్నారు. సాగర్ జలాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 2.55 లక్షలు ఎకరాలు, ఆంధ్రలో 1.25 లక్షల ఎకరాలకు సాగర్ నీరు అందుతుందని తెలిపారు. గత సీజన్‌లో సరిపడా నీరు లేకపోవడంతో ఒక్కపంటకే నీరందిందని తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడిన పక్షంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా అందించేందుకు వీలైనంత త్వరగా పూర్తిచేస్తామని తెలిపారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐబీ సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మంగళంపూడి వెంకటేశ్వరరావు, డీఈలు మధు, బానాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినీహైడల్ అధికారులపై ఆగ్రహం

పాలేరు మినీహైడల్ అధికారులపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడమకాల్వకు నీరు విడుదల చేసిన అనంతరం మంత్రి మినీహైడల్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈ అఖిల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నడుస్తుందా అని ప్రశ్నించగా, అందుకు ఒక యూనిట్ మరమ్మతుల్లో ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఖాళీ సమయంలో ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. 'జీతాలు తీసుకుంటున్నారుగా పని చేయలేరా.. నీళ్లు వదిలే సమయానికి సిద్ధం చేసుకోకుండా ఏం చేస్తున్నారు..?' అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రాజెక్టు సీఈకి ఫోన్ చేసి విస్మయం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రానికి రికార్డులతో తనను కలవాలని తెలిపారు. పక్కనే ఉన్న కలెక్టర్‌ను ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి పవర్ జనరేట్ అయ్యేలా చూడాలని తెలిపారు.

పెదవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణం

- గేట్ల సంఖ్యను మూడు నుంచి ఆరుకు పెంచాలి
- 80 వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చూడాలి
- జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హాతో మంత్రి తుమ్మల చర్చ

ఖమ్మం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో బుధవారం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్ ఎంకే సిన్హా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టులు, గోదావరి జలాల కేటాయింపుపై చర్చించారు. ఇటీవల అశ్వారావుపేట మండలంలో తెగిన పెదవాగు ప్రాజెక్టును పునః నిర్మించేందుకు రీడిజైన్‌పైనా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మూడు గేట్లనుంచి ఆరు గేట్లకు పెంచి 80 వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా పెదవాగు ప్రాజెక్టును పునఃనిర్మించాలని, తద్వారా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దు రైతాంగానికి ఉపయోగం ఉంటుందని తుమ్మల సూచించారు.

పెదవాగు పరిధిలో 16 వేల ఆయకట్టు ఉండగా కాలువలు, మరమ్మతుల విషయంలో ఏ రాష్ట్రం పరిధిలో ఆ రాష్ట్రం అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందని, ఈ విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి జలాల్లో తెలంగాణ నీటి వాటా హక్కులు కాపాడాలని, రాష్ట్రవాటాకు ఇబ్బందులు లేకుండా కేటాయింపులు చేయాలని, ఇరు రాష్ట్రాలకు ఎలాంటి నీటి సమస్యలు లేకుండా చూడాలని, పెండింగ్ ప్రాజెక్టులపై సిన్హాతో మంత్రి తుమ్మల చర్చించారు. ఏటా గోదావరి జలాలు వృథా అవుతున్నాయని, ఈ జలాలను తెలంగాణ వినియోగించుకునేలా ఎలా కార్యాచరణ చేపట్టాలన్న అంశంపై మంత్రి తుమ్మల చర్చించారు.



మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హా



డిప్యూటీ సీఎం భట్టితో చర్చిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

భట్టితో ఎమ్మెల్యే కూనంనేని భేటీ

కేటీపీఎస్, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చ 6



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాలో సీఎం సభాస్థలి మార్పు

వర్షాలతో బురదమయం కావడమే కారణం

టీచర్ శిరీషపై సస్పెన్షన్ ఎత్తివేత

- విద్యార్థుల జుట్టు కత్తిరించిన ఘటనలో గత నెల 27న వేటు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 7: క్రమశిక్షణ పేరుతో విద్యార్థుల జుట్టును అడ్డదిడ్డంగా కత్తిరించి సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయిని దిగుమర్తి శిరీషను అధికారులు తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ బుధవారం ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు మండలం పేరువంచ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్ శిరీష. విద్యార్థులు ఇష్టం ఉన్నట్టుగా జుట్టు పెంచుకొని క్రమశిక్షణ తప్పుతున్నారనే కారణంతో గత నెల 27న దాదాపు 15 మంది విద్యార్థుల జుట్టును అడ్డదిడ్డంగా కత్తిరించిన విషయం విదితమే. ఈ సంఘటన వివాదాస్పదంగా మారడంతో టీచర్ శిరీషను సస్పెండ్ చేశారు. కాగా, బుధవారం ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి కల్లూరు మండలం చెన్నూరు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పోస్టింగ్ ఇస్తూ డీఈవో ఉత్తర్వులు జారీచేశారు. జరిగిన ఘటనపై విచారణ కొనసాగుతుందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 7: ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు ఆయన జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయానికి వెళ్లి ప్రత్యేక అధికారిగా బాధ్యతలను చేపట్టారు. ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పదవీకాలం మంగళవారంతో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజాపరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ సీఈవో ఎస్.వినోద్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బదిలీపై రాజన్న సిరిసిల్ల జడ్పీ సీఈవోగా వెళ్లనున్న ఎస్.వినోద్‌ను కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. ఆయన జిల్లాకు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, పర్యవేక్షకులు సీహెచ్ రాజ్యలక్ష్మి, వైవీ రమణ, రమణశేఖర్, మధుకుమార్ వివిధ విభాగాల అధికారులు రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎప్‌సెట్ తుది కౌన్సిలింగ్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 7: ఎప్‌సెట్ చివరి విడత కౌన్సిలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. రెండు విడతల్లో జరిగిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు 9న జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు. 8న స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, 9, 10 తేదీల్లో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని, 13న సీట్ల కేటాయింపు, 15, 16, 17 తేదీలలో కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

వాన.. వరద

- విడువని వర్షానికి పొంగుతున్న వాగులు
- నిండుకుండల్లా జలవనరులు


సత్తుపల్లి కిష్టారం వై-జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నీరు




రామవరం ఎంసీహెచ్‌లో చెప్టాపై ప్రవహిస్తున్న వరద


ఆళ్లపల్లి మండలంలో తెగిపోయిన రాయిగూడెం రోడ్డు


ఏన్కూరు బీఎన్ తండాలో..


కరకగూడెం, రంగాపురం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


చవిటిగూడెం లోలెవల్ వంతెనపై వరద


లక్ష్మీదేవిపల్లి - గరీబ్‌పేట మధ్యలో చిన్నవాగు


తుమ్మలచెరువు లోతువాగు వద్ద పోలీస్ బందోబస్తు


అలుగు పోస్తున్న కారేపల్లి పెద్ద చెరువు


రామానగరంలో వరదలో చేపలు పడుతున్న స్థానికులు

శాశ్వత పరిష్కారం లేదా..!

- మరోసారి నీట మునిగిన రామాలయ పరిసరాలు, అన్నదాన సత్రం
- రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం

భద్రాచలం, ఆగస్టు 7: భద్రాద్రిలో ప్రస్తుతం వరద సమస్య లేకపోయినా మరోసారి రామాలయ పరిసరాలు, దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రం నీట మునగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనికి కారణం లేకపోలేదు. భద్రాచలంలో గోదావరి నీటిమట్ట 34.6 అడుగులు మాత్రమే ఉంది. దీంతో వరద సమస్య లేకపోయినా రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో ఒక్కసారిగా పరిస్థితి తారుమారైంది. అప్పటి వరకు సాధారణంగా ఉన్న చప్టాదిగువ, రామాలయ పరిసరాల్లోకి ఒక్కసారిగా నడుము లోతు నీరు రావడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇక్కడ చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. అప్పటికప్పుడే వర్షపునీరు భారీగా రావడంతో అసలు ఏం జరుగుతోందో తెలుసుకునే లోపే దుకాణాల్లోకి నీరు రావడం, మునగడంతో తీవ్ర ఆవేదన చెందారు. ఇక నిత్యన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేసే టేబుళ్ల ఎత్తులో వర్షపు నీరు చేరడంతో దేవస్థానం సిబ్బంది సైతం తీవ్ర అవస్థల పాలయ్యారు. సామాన్లన్ని మునిగిపోకుండా సురక్షిత ప్రాంతం వైపు తరలించారు.

రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం

భద్రాద్రిలో గత రెండు దశాబ్దాల కాలంలో కురిసిన వర్షపాతంలో ఇదే అత్యధికమని నీటిపారుదల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత రెండు దశాబ్దాల్లో 24 గంటల పాటు నిరాటంకంగా గరిష్ఠంగా సగటున 23 సెం.మీ వర్షపాతం నమోదైందని తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం నాడు రెండు గంటల పాటు కుండపోతలా కురిసిన వర్షం కారణంగా ఆరు సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు. అంటే మొత్తం 300 క్యూసెక్కుల నీరు ఒక్కసారిగా చప్టా దిగువ ప్రాంతంలోకి చేరిందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి విస్తాకాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిస్ ద్వారా గరిష్ఠంగా 60 క్యూసెక్కుల నీటిని మాత్రమే పంపేందుకు వెసులుబాటు ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కాని బుధవారం వచ్చిన వర్షపు నీరు ఐదు రెట్లు అధికంగా ఉండటంతో సమస్య తలెత్తిందంటున్నారు.


భద్రాచలంలో వర్షపు నీటిలో రామాలయ పరిసరాలు


భద్రాద్రి రామాలయం పడమర మెట్ల వైపు వర్షపు నీరు

షటర్‌లు మూసివేయడంతో సమస్య ఏర్పడింది
జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్

గోదావరి వరదల కారణంగా స్లూయిస్ షట్టర్‌లు మూసివేయడంతోనే ఈ సమస్య ఏర్పడింది. నీటిపారుదల శాఖ అధికారులు వర్షపు నీటిని ఎప్పటికప్పుడు 24 గంటల పాటు అవసరమైన సమయంలో మోటార్ల సహాయంతో ఎత్తిపోస్తూనే ఉంటారు. బుధవారం ఆకస్మాత్తుగా అధిక వర్షపాతం నమోదు కావడం, షట్టర్‌లు మూసి ఉండటంతోనే నీరు రామాలయ పరిసరాల్లోకి వచ్చింది. దీంతో మూడు గంటల వ్యవధిలోనే నీటినంతా తిరిగి గోదావరిలోకి ఎత్తిపోశారు. అధికారులంతా అప్రమత్తంగానే పని చేస్తున్నారు, ఇందులో ఎటువంటి అపోహలకు తావు లేదు. అశోకనగర్ కొత్తకాలనీవాసులు శాశ్వత పునరావాసం కోరుతున్నారు దానిపై ఆలోచిస్తున్నాం. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.


చప్టా దాటి రోగుల వద్దకే వెళ్లి చికిత్స అందిస్తున్న ఆర్ఎంవో వీరబాబు

గర్భిణులు, చిన్నారులకు కష్టాలు

చుంచుపల్లి, ఆగస్టు 7: భారీ వర్షాలకు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి పరిధిలోని రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో గర్భిణులకు, చిన్నారులకు వరద కష్టాలు తప్పలేదు. బుధవారం కురిసిన వర్షానికి గరీబ్‌పేట ప్రాంతంలోఉన్న చెరువులు, కాలువల నుంచి వరద ఉధృతి పెరగడంతో రామవరం ఎంసీహెచ్‌లో చెప్టాపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో ఆసుపత్రికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఆసుపత్రికి వైద్య సేవలను పొందేందుకు వెళ్లే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆసుపత్రికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో చిన్నారులకు వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ వీరబాబు చెప్టా అవతలికి వెళ్లి ప్యాసింజర్ ఆటోలో వచ్చిన రోగులకు చికిత్స అందించారు. సుమారు నలుగురు రోగులకు ఇదే విధంగా సేవలు అందించడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. క్రమంగా ఈ వరద ఉద్రితి చెప్టాపై నుంచి తగ్గడంతో ఆసుపత్రి వర్గాలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎడతెరపిలేని వాన

(5వ పేజీ తరువాయి)

చిరువ్యాపారుల దుకాణాల వద్ద వర్షపు నీరు చేరింది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా వర్షపునీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేయకపోవడంతో ఆయా పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. ఈ సమాచారం అందుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బూర్గంపాడు మండలంలో పొలాలు, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి 85 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. కరకగూడెం మండలంలో రంగాపురం, పద్మాపురం ప్రధాన రహదారిపై వరద ప్రవహిస్తోంది.

పాల్వంచలోని హిల్స్‌కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో చినవాగు పొంగి ప్రవహిస్తోంది. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై వర్షపునీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రామవరంలో ఎసీహెచ్ ఆసుపత్రివద్ద వర్షపు నీరు చేరడంతో గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులెదుర్కొన్నారు. అశ్వాపురం మండలం తుమ్మల చెరువు, వెంకటాపురం గ్రామాల వద్ద లోతువాగు వర్షాలకు ఉధృతంగా ప్రవహించడంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలు నిలిపేశారు. భారీ వర్షాలతో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరులోని సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జిల్లాలో 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

పకడ్బందీగా సింగరేణి
ఎక్స్‌టర్నల్ పోస్టుల పరీక్షలు

- ఏడు జిల్లాలో హాజరైన 29.291 మంది అభ్యర్థులు

ఆంధ్రజ్యోతి కొత్తగూడెం, ఆగస్టు 7: సింగరేణి సంస్థలో 327 పోస్టుల భర్తీ కోసం మంగళ, బుధవారాల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఏడు జిల్లాల్లోని 32పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 29.291 మంది అభ్యర్థులు హాజరైనట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలను వెల్లడించారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఈఅండ్ఎం)42పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సిస్టమ్స్)7పోస్టులు, జెఎంఈటీ 100, అసిస్టెంట్‌పోర్‌మెన్ ట్రైనీ (మెకానికల్)9, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్) 24, ఫిట్టర్ ట్రైనీ 47, ఎలక్ట్రీషియన్ ట్రైనీ 98 పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించనట్లు తెలిపారు. పూర్తి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే నియమాకాలు జరుగుతాయని, పరీక్షలకు సంబంధించిన కీని వారం రోజుల్లో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణను హైదారాబాద్‌లోని కంట్రోల్‌రూంలోని సీసీ కెమెరాల్లో పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్‌మేనేజర్ పర్సనల్ అండ్ వెల్ఫేర్ సామేల్‌సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో మునిగి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని బయటకు తీసిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది
- భద్రాచలంలో ఇది రెండో ఘటన

భద్రాచలం, ఆగస్టు 7: భద్రాచలంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో పట్టణంలో రహదారులు, డ్రైన్లు పొంగిపొర్లాయి. ఈ క్రమంలో చర్ల రహదారిలో ఒక వ్యక్తి డ్రైనేజీలో పడి మృతి చెందాడు. పాత సామగ్రి ఏరుకొని జీవనం సాగించే భార్య, భర్తలు సున్నం సతీష్(45), సుజాతలు డ్రైనేజీ దగ్గర పాతసామగ్రి సేకరించేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు డ్రైన్‌లో జారిపడటంతో అక్కడ లోతు ఉండటంతో ప్రవాహ తాకిడికి కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే భద్రాచలం తహసీల్దారు శ్రీనివాసరావు, సీఐ సంజీవరావు, ఎన్డీఆర్ఎఫ్, పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకొని గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. రాత్రి 8గంటల సమయంలో అతడి మృతదేహం గల్లంతైన ప్రాంతానికి సమీపంలో లభించింది.

భద్రాద్రిలో ఇది రెండో ఘటన

భద్రాద్రిలో భారీ వర్షం కురిసిన సమయంలో డ్రైనేజీలో పడి వ్యక్తి గల్లంతైన ఘటన ఇది రెండోది. గత ఏడాది సెప్టెంబరు 30న అప్పటి కేటీఆర్ భద్రాచలం పర్యటన నేపథ్యంలో బందోబస్తు కోసం వచ్చిన కొత్తగూడెం హెడ్ కానిస్టేబుల్ టి.శ్రీదేవి రామాలయ నిత్యన్నదాన సత్రం వద్ద ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి మృతి చెందారు. మళ్లీ తాజాగా బుధవారం సున్నం సతీష్ అనే వ్యక్తి డ్రెయిన్‌లో కొట్టుకుపోవడం గమనార్హం. కాగా నిరుపేద కుటుంబానికి చెందిన సతీష్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


డ్రెయిన్‌లో గాలిస్తున్న దృశ్యం


సున్నం సతీష్ మృతదేహం

గిరిజన నిరుద్యోగ యువతకు
శిక్షణతో కూడిన ఉపాధి

భద్రాచలం, ఆగస్టు 7: గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి జీవనోపాధికి సహకరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సంబంధిత కంపెనీ అధికారులకు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో జిల్లాలోని ఐటీసీ, కేటీపీఎస్, బీపీటీఎస్, జెన్కో, నవభారత్ కంపెనీల మేనేజర్లతో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టవలసిన కార్యాచరణ గురించి సమావేశం నిర్వహించారు. ఆదివాసీ గిరిజనులు ఉన్నత చదువులు చదువుకున్న వారికి విద్యార్హతను బట్టి కంపెనీల్లో వివిధ కోర్సుల్లో ఉచిత వసతితోపాటు నైపుణ్య శిక్షణను అందించి అవకాశాలు కల్పించాలని కోరారు. జీవనోపాధికి పనికి వచ్చే సోలార్, లాజెస్టిక్, వెబ్ డవలప్‌మెంటు, డ్రైవింగ్, మహిళలకు కుట్టు అల్లికలు, ఎంబ్రాయిడింగ్ శిక్షణలు అందించి వారి జీవనోపాధికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఏపీవో మునీర్‌పాషా, ఐటీసీ చీఫ్ చంగల్‌రావు పాల్గొన్నారు.

వైరాలో సీఎం సభాస్థలి మార్పు

- వర్షాలతో బురదమయం కావడమే కారణం
- ప్రత్యామ్నాయ స్థలం అన్వేషణలో అధికారులు

వైరా, ఆగస్టు 7: ఈ నెల 15న వైరాలో నిర్వహించతలపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు తొలుత ఎంపిక చేసిన స్థలానికి బదులు మరో స్థలాన్ని అధికారులు అన్వేషిస్తున్నారు. మూడురోజుల కిందట పామాయిల్‌తోట సమీపంలో ఒక స్థలాన్ని ఎంపిక చేశారు. పెసర పంటలున్న భూములను కూడా సభ కోసం తీసుకొనేందుకు రైతులను ఒప్పించి ఆ పంటను కూడా తొలగించారు. గత రెండురోజుల నుంచి బహిరంగ సభకు అవసరమైన పనులు కూడా చేపట్టారు. అయితే మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ స్థలంలో వర్షపునీరు చేరి బురదమయంగా మారింది.

ఇక్కడ సభ నిర్వహణ అసాధ్యమని భావించి ప్రత్యామ్నాయ స్థల అన్వేషణ చేపట్టారు. స్థానిక న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల సమీపంలోని స్థలాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, ఖమ్మం ఆర్డీవో గణేష్, ఏసీపీ ఎన్.వెంకటేష్, వైరా సీఐ ఎన్.సాగర్, ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, వైరా ఆర్అండ్‌బీ డీఈ ఎం.రమేష్, ఏఈ విశ్వనాథం, వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్, సీపీతో చర్చించి గురువారం మరోసారి ఈ స్థలాన్ని పరిశీలించి సీఎం సభ కోసం అనుకూలమైనదా కాదా అని నిర్ణయించనున్నారు. ఇప్పటికే సీఎం సభ కోసం అవసరమైన మెటీరియల్‌తో పదుల సంఖ్యలో వాహనాలు వైరాకు చేరాయి. 15న సీఎం రేవంత్ సీతారామ పంపుహౌస్‌లను ప్రారంభించిన అనంతరం వైరాలో రైతులతో బహిరంగసభ నిర్వహించనున్నారు. రుణమాఫీ మూడో విడతను సభా వేదిక నుంచే ప్రారంభించనున్నారు.

కల్లూరు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- నిండుకుండలా సాగర్ ప్రాజెక్టు
- వారం రోజుల్లో కల్లూరు సర్కిల్‌కు సాగునీరు
- ఏడు దశలుగా వానాకాల పంటకు నీటిసరఫరా
- ప్రణాళిక రూపొందించిన అధికారులు

కల్లూరు, ఆగస్టు7: నాగార్జున సాగర్ ప్రాజెక్టు డ్యాంకు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరటంతో కల్లూరు సర్కిల్ పరిధిలో ఆయకట్టు రైతుల ఆశలు చిగురించాయి. సాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమకాల్వకు నీటిని ప్రభుత్వం విడుదల చేయటం తెలిసిందే.. ఈ నేపథ్యంలో పాలేరు రిజర్వాయర్‌లోకి సాగర్ జలాలు వస్తున్నాయి. పాలేరు నుంచి దిగువన గల సాగర్ ఎడమకాల్వ రెండో జోన్ కల్లూరు సర్కిల్ పరిధిలో ఆయకట్టు ప్రాంత వ్యవసాయ భూములకు మరోవారంలో సాగర్ జలాలు విడుదల కానున్నాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. దీంతో ఈప్రాంత ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

1,79,652 లక్షల ఎకరాల ఆయుకట్టు

కల్లూరు జలనరులశాఖ సర్కిల్ పరిధిలో కల్లూరు, మధిర, సత్తుపల్లి డివిజన్లు ఉన్నాయి. వాటి పరిధిలో గల తొమ్మిది మండలాల్లో స్థిరీకరించిన ప్రకారం 1,79,652 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 12లోగా సాగర్ ఎడమకాల్వ ద్వారా వానకాలం పంటకు సాగునీటి సరఫరా జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. వానకాలం మొదటి పంటకు గాను పై విధంగా 1,79,652 ఎకరాలతో పాటుగా, సాగర్ కాల్వ పైన గల ఎత్తి పోతల పథకాల పరిధిలో గల మరో 11వేల ఎకరాల ఆయకట్టుకు గాను 18.58 టీఎంసీల వరకు సాగునీటి అవసరం ఉంది. దీనిపై సర్కిల్ అధికా రులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

ఏడు దశలుగా నీటి విడుదల

కల్లూరుసర్కిల్ పరిధిలో వానకాలం పంటకు 7 దశలుగా సాగర్ నీరు అందించాలని అధికారులు నిర్ణయిచారు. మొదటి విడతగా వరినారు మడుల్లో రైతులు దమ్ములు చేసుకొనేలా ఈ నెలఖారు నాటికి సాగునీరు సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించారు. తరువాత వారం నీటి సరఫరా నిలిపివేసి (వారబందిపై) రెండో దశనుంచి ఏడోదశ వరకు సగటున 2.14 టీఎంసీల నీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. పాలేరు దిగువన సాగర్ ప్రధాన కాల్వ 52 కి.మీ. నుంచి 102 కి.మీ. వరకు కల్లూరు సర్కిల్ విస్తరించి ఉంది. ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో కల్లూరు జల వనరులశాఖ సర్కిల్ పరిధిలో సాగునీటి సరఫరా విషయమై ఇంజనీరింగ్ అధికారులు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కరును అప్రమత్తం చేయాలని ఉన్నత అధికారులు ఆదేశించటమే కాక, తగిన సమాచారం కూడా అందించారని తెలిసింది. జిల్లాలోని పాలేరు రిజర్వాయిర్‌లో సాగర్ ఎడమ కాల్వ ఎగున నుంచి ఇన్‌ఫ్లో వాటర్ 2,100 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుంది. దీంతో పాలేరు రిజర్వాయిర్ పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులకు గాను 17 అడుగులకు చేరి మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయి నీటి మట్టం సామార్థ్యానికి చేరుతుంది.

సాగర్ జలాల ఆశతో ముందస్తుగా వరిసాగు

ఈ ఏడాది వానకాల సీజన్ ఆశాజనకంగా ఉంటుందని భావించిన సాగర్ ర్ ఆయకట్టు రైతులు ముందస్తుగానే తమ పంట పొలాల్లో దుక్కిలు దున్ని వరినాట్లు వేశారు. ఇలా గత జూలై నెల నుంచి వర్షాలు కురవటంతో కల్లూరు జలవనరులశాఖ పరిధిలో గల సాగర్ ఆయకట్టు రైతులు వర్షాధారంగానే వరి పంట సాగుకు సిద్ధమై గత జూన్ నెల చివరి నుంచి నార్లు పోశారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో (కల్లూరు సర్కిల్) 70 శాతం వరకు ఇప్పటికే ముందస్తుగా రైతుల నాట్లు వేశారు. ఇక లిఫ్ట్ పరిధిలో, సాగర్ ఆయకట్టు మెరక భూముల్లో ఆగస్టు చివరి వరకు నాట్లు వేసే అవకాశం ఉంది.


కల్లూరు సాగర్ ఎడమకాల్వ రెగ్యులేటర్ వ్యూ

భట్టితో ఎమ్మెల్యే కూనంనేని భేటీ

- కేటీపీఎస్, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చ

కొత్తగూడెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు భేటీ అయ్యారు. బుధవారం ప్రగతి భవన్‌లో విక్రమార్కను కలుసుకొని నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలతోపాటు లేఖలు అందించారు. పాల్వంచ థర్మల్ విద్యుత్ కర్మాగారంలో ఇటీవల తొలగించిన ఏ, బీ, సీ ప్లాంట్ల స్థానంలో 1600 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని, 800 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో రెండు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు కూనంనేని తెలిపారు. కేటీపీఎస్‌లో చోటు చేసుకున్న రూ.2వేల కోట్ల స్క్రాప్ కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులు అవినీతిని, అక్రమాలు నిగ్గు తేల్చడంలో జాప్యం జరుగుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'నియోజకవర్గంలో ప్రతిపాదనలో ఉన్న, జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులను తక్షణమే విడుదల చేయాలి. కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేసి ఈ ప్రాంత అస్తిత్వాన్ని కాపాడాలి. పదవీ విరమణ చెందిన సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయడంతోపాటు, ప్రస్తుతం సింగరేణి క్వార్టర్స్‌లో నివసించి పదవీ విరమణ పొందిన కార్మికులకు వారు నివసించే క్వార్టర్లను కూల్చివేసే విధానానికి స్వస్తి చెప్పి, వారికే కేటాయించి సొంతింటి కల నెరవేర్చాలి. అతి తక్కువ పెన్షన్ వచ్చే సింగరేణి మాజీ కార్మికులకు ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాలి. మాజీ కార్మికులకు సంస్థ ద్వారా చెల్లించే పెన్షన్ పెంచే విధంగా ప్రతిపాదించాలి..' అని భట్టిని కోరినట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో వైరా లయన్స్‌క్లబ్‌కు సేవ అవార్డులు



అవార్డులందుకుంటున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

వైరా, ఆగస్టు 7: వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించిన వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్‌క్లబ్‌లకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవ అవార్డుల పంట పండింది. మంగళవారం రాత్రి ఈ సేవ అవార్డులను ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, పెనుగొండ ఉపేంద్రరావు, శివప్రసాద్, భారతి, డాక్టర్ శ్రీధర్ అందుకున్నారు. రాష్ట్రస్థాయిలోనే అత్యధికంగా రాయితీపై పేద, నిరుపేద విద్యార్థులకు 20 ల్యాప్‌టాప్‌లు, 105కుట్టుమిషన్లు, 15వీల్‌ఛైర్లు, పది ట్రైసైకిళ్లు, 9తోపుడుబండ్లను, విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థికసాయం వంటి సేవ కార్యక్రమాలకు ఈ అవార్డులు లభించాయి. అవార్డులు అందుకున్న వారిని బుధవారం వైరాలో ఆక్లబ్ నిర్వాహకులు సన్మానించారు.

పూర్తిస్థాయి నీటిమట్టానికి అడుగుదూరంలో వైరా రిజర్వాయర్



నిండు కుండలా వైరా రిజర్వాయర్

వైరా, ఆగస్టు 7: వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి ఒక్క అడుగుదూరంలో ఉంది. ప్రస్తుతం వస్తున్న వరద ప్రవాహం యథావిధిగా కొనసాగితే గురువారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం దాటే అవకాశాలున్నాయి. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 17.3అడుగులకు చేరుకుంది. ఇంకా రిజర్వాయర్‌కు క్యాచ్‌మెంట్ ఏరియాలోని ఏర్లు, వాగుల నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరుతుంది. ఇంకా కేవలం అడుగు నీరు వస్తే రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టమైన 18.3అడుగులు దాటి అలుగుల ద్వారా నీరు బయటకు పొంగి ప్రవహించే అవకాశాలున్నాయి. కేవలం మంగళ, బుధవారాల్లో దాదాపు 5.9అడుగుల వరదనీరు రిజర్వాయర్‌లోకి వచ్చిచేరింది. దాంతో 12.6అడుగులుగా ఉన్న నీటిమట్టం 17.3అడుగులకు పెరిగింది. వైరా ఆయకట్టులో ఖరీఫ్ సాగు కోసం మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భారీ వర్షాలు కురిసి వరదనీరు రావడంతో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువైంది. దాంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తండాలకు తీజ్ ఉత్సవ శోభ..

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు 7: గిరిజన తండాల్లో తీజ్ ఉత్సవ సందడి సంతరించుకుంది. పండుగ లంబాడీ తెగకు సంబంధించిన కట్టుబొట్టు, బోనం, వేషభాషలు, ఆచారలపై ఆధారపడి ఉండటంతో తీజ్ సందర్భంగా గిరిజన తండాల్లో సంప్రదాయ శోభ ఉట్టిపడుతోంది. కనుమరుగవుతున్న లంబాడీల కట్టు బొట్టు పండుగ సందర్భంగా దర్శణమివ్వనుంది.

ప్రతి ఏటా శ్రావణ మాసంలో...

లంబడీ తెగకు చెందిన ప్రజలు తీజ్ ఉత్సవాన్ని ప్రతి ఏటా శ్రావణ మాసం ఆరంభంలో ఎంతో భక్తిశ్రద్ధలతో సంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నిర్వహిస్తారు. తీజ్ అంటే మొలకలు అని అర్థం కనుక ఈ పండుగను మొలకల పండుగ అని కూడా పిలుస్తారు. గురువారంనుంచి 18వ తేదీ వరకు పండుగను రోజుకో విధంగా జరుపుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంట విలసిల్లాలని తండా వాసుల కష్టాలు తీరాలని పెళ్లి వయస్సు అమ్మాయిలకు మంచి వరుడు లభించాలని తండా నాయకుడు క్షేమంగా ఉండాలని కోరుతూ పండుగను నిర్వహించుకుంటారు. పెళ్లి కాని యువతులు వెదురు బుట్టల్లో నల్ల మట్టిని నింపి అందులో గోధుమ గింజలను చల్లటం ద్వారా పండుగ మొదలవుతుంది. ఉత్సవం ప్రారంభం రోజున అందరూ తమ ఇళ్లను శుభ్ర పరుచుకొని అందంగా అలంకరించుకుంటారు. నారు పోసిన గోధుమ బుట్టలకు సంప్రదాయ పద్దతుల్లో రోజుకు మూడు సార్లు నీటిని అందిస్తారు. ఈ క్రమంలో సంప్రదాయ పాటలు పాడటం వంటివి సామూహికంగా చేస్తారు.

తీజ్ ఇలా...

తీజ్ పండుగలో మొదటి రోజున గోధుమలు తీసుకు రావటం, రెండోరోజు

▸▸ నేటినుంచి 18 వరకు తీజ్ ఉత్సవాలు..



వాటిని నానబెట్టటం, మూడో రోజు నానబెట్టిన గోధుమలను బుట్టల్లో వేయటం, నాలుగో రోజున, నానబెట్టిన శనగలను ముళ్లకు గుచ్చటం, ఐదవ రోజున రొట్టెలు, బెల్లం, నెయ్యితో చుర్మో అనేసంప్రదాయ వంటకం తయారు చేయటం, ఆరవ రోజున, మహిళలు, యువతులు చెట్లకు ఉయ్యాలలు కట్టి ఊగటం, ఏడవ రోజున తమ పూర్వీకులను స్మరించుకొని వారికి నైవేద్యాలు సమర్పించటం, ఎనిమిదవ రోజున తండాకు చెందిన భార్య భర్తలు తమ సంప్రదాయ నృత్యాలు చేయటం, తొమ్మిదవ రోజున తండా వాసులు అందరూ కలిసి ఆటలు, పాటల వేడుక జరుపుతారు. పదవ రోజున సంత్‌సేవాలాల్ మహరాజ్‌కు భోగ్ భండారో నిర్వహిస్తారు. పదకొండవ రోజున కడావో తీజ్ పేరుతో గోధుమ బుట్టలను తలపై బోనం ధరించి వాటిని నిమజ్జనం చేస్తారు.

సమస్యల పరిష్కారానికి ఫోరంని ఆశ్రయించండి

● విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల చారి

చంద్రుగొండ, అగస్టు 7: వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలు పరిష్కారం కాకుంటే విద్యుత్ వినియోగదారుల ఫోరంని ఆశ్రయించాలని, అక్కడ వారికి న్యాయం జరుగుతుందని ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి సూచించారు. బుధవారం చంద్రుగొండ రైతు వేదికలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారులతో చైర్మన్ వేణుగోపాల చారి మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు, బిల్లులు, వోల్టేజి హెచ్చుతగ్గులలో లోపాలను సరిచేయకపోవటం, కొత్త సర్వీసులు విడుదల చేయకపోవటం, యజమాని పేరు మార్పిడి లాంటి అంశాలతో పాటు మొత్తం 13 అంశాలపై నెలకున్న సమస్యలను స్థానిక విద్యుత్ అధికారుల, సిబ్బంది పరిష్కరించకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, న్యాయం కోసం ఫోరంని ఆశ్రయించాలని కోరారు. అనంతరం కొందరి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె రమేష్, చరణ్‌దాస్, నరేందర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఏఈ నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జక్కంపూడి దంపతులకు నామా నివాళి

● సంస్మరణ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

తల్లాడ, ఆగస్టు 7: మండలంలోని బిల్లుపాడులో మృతి చెందిన మాజీ సర్పంచులు, ప్రముఖ రాజకీయ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత దంపతులకు బుధవారం రాత్రి మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి జక్కంపూడి కుటుంబాన్ని పరామర్శించారు. గురువారం వెంకటగిరి క్రాస్ రోడ్డులోని ఆర్పి గార్డెన్‌లో జరగనున్న జక్కంపూడి దంపతుల సంస్మరణ సభ ఏర్పాట్లను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. జక్కంపూడి కుమారులు కిషోర్, రాముతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారితో పాటుగా మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డం వీరమోహనరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, బుద్ధిసాగర్, శరత్ బాబు పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నామా, సంస్మరణసభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తుమ్మల

స్పోర్ట్స్ స్కూల్స్‌కు 11 మంది విద్యార్థుల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 7: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా స్టేట్ (శాట్స్) ఆధ్వర్యంలో ఈనెల 9,10 తేదీలలో హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగిన స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు జరిగిన ఎంపికల్లో జిల్లాకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికైనారు. రాష్ట్ర స్థాయి ఎంపికల్లో జిల్లా నుంచి మొత్తం 32 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ముగ్గురు బాలురు, 8 మంది బాలికలు ఎంపికైనట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ నందు నలుగురు, ఆదిలాబాద్‌కు ఐదుగురు, కరీంనగర్‌కు స్పోర్ట్స్ స్కూల్‌కు ఇద్దరు విద్యార్థులను కేటా యించినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఆయన ప్రకటించారు. ఖమ్మం అర్బన్ మండలం నుంచి ఆశ్రిత, అక్షరచంద్ర, లితిక, కల్లూరు మండలా నికి చెందిన హన్సిక, ఉత్తేజ్‌నాయక్, అనుశ్రీ, పాండురంగాపురానికి చెందిన వెన్నెల, ఏన్కూరు మండలానికి చెందిన జస్విత, యశస్విని, చేతన్‌క్రిష్ణ నాయక్, చందన ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

నేడు ఖమ్మానికి సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 7: సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిషన్) డైరెక్టర్ వీపీ గౌతమ్ గురువారం ఖమ్మానికి రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు ఖానాపురంలో నిర్వహించే కార్యక్రమంతో పాటుగా పలు డివిజన్లలో పరిశుభ్రతను పరిశీలించనున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ, ఆగస్టు 7: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ముదిగొండ మండలం సువర్ణాపురం రెవెన్యూ పరిధి లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన మందనపు నాగేశ్వరరావు(45) కొంతకాలంగా ఖమ్మంలో నివాసముంటున్నాడు. ముదిగొండ, నేలకొండపల్లి ప్రాంతాల్లో కేబుల్ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా నాగేశ్వరరా వు ఆర్థిక ఇబ్బందులతో సతమతమ వుతూ మంగళవారం అర్ధరాత్రి సమయంలో సువర్ణాపురం రెవెన్యూ పరిధిలోని జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న మామిడిచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా 'సీతారామ' పనులు

ఏన్కూరు, ఆగస్టు 7: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. భారీ వర్షంలోను కాలవ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రూ.70కోట్లతో లక్షా 20వేల ఎకరాలకు నీరు అందించే ప్రాజెక్టును ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉండడంతో రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయి. లింక్‌కెనాల్ పై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఐదారుసార్లు కాలవ పనులును క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల్లో వేగం పెంచారు. నిత్యం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి త్వరితగతిన పూర్తిచేసేందుకు విశేష కృషిచేస్తున్నారు. కాలవలు, వంతెలన అండర్‌టన్నెళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈప్రాజెక్టు వల్ల గోదావరి జలాలతో వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలు సస్యశ్యామలం



వర్షంలోనూ కాల్వ పనులు చేపడుతున్న దృశ్యం

కానున్నాయి. ఈప్రాజెక్టు పనులను ఎస్ఈ శ్రీనివాసరెడిడ, ఈఈ అర్జున్, డీ ఈ చంద్రశేఖర్, జేఈ సాగర్, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నాళ్లీ దుస్థితి..

▸▸ రహదారులకు నోచుకోని ఏజెన్సీ గ్రామాలు

▸▸ చర్ల మండలంలో జడ్డీ కట్టి గర్భిణి తరలింపు

చర్ల, ఆగస్టు 7: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో నేటికీ రహదారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గర్భిణుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో జరిగిన ఓ ఘటన ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. చర్ల మండలం భూరుగుపాడు గ్రామానికి చెందిన రవ్వ ఉంగి అనే గర్భిణికి నెలలు నిండి పురుటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి తరలించేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు జెడ్డీ కట్టి ఆమను వర్షంలో సుమారు 3కిలో మీటర్లు మోసుకుని వెళ్లి అంబులెన్స్ ఎక్కించారు. అక్కడి నుంచి ఆమెను చర్ల మండలంలోని సత్యన్నారాయణపురం వైద్యశాలకు తరలించారు. ఉంగి అక్కడ ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది.



గర్భిణిని జెడ్డీలో అంబులెన్స్ వద్దకు తరలిస్తున్న దృశ్యం

భద్రాద్రి ఏజెన్సీలో వర్షాకాలంలో గర్భిణులను ముందే వైద్యశాలకు తరలించాలని అధికారులు ఆదేశిస్తున్నా అవి అమలు కావడం లేదు. గర్భిణీ ఉంగిని ముందే వైద్యశాలకు తరలించి ఉంటే నేడు జడ్డీ కట్టే దుస్థితి వచ్చేది కాదని స్థానికులు వాపోతున్నారు.

భూమి విషయంలో తగాదా..

● సెల్ఫీవీడియో తీసుకుని రైతు ఆత్మహత్యాయత్నం

● ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి

ఖమ్మం రూరల్, ఆగస్టు 7: కొందరు తన భూమిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మనస్థాపంతో ఓ రైతు తన భూమివద్దనే సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగులమందు తాగిన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం, జాన్‌బాద్‌తండా గ్రామానికి చెందిన ఏలేటి వెంకటరెడ్డి(50) కుటుంబానికి గ్రామంలో కొంత భూమి ఉంది. అందులో 26కుంటల భూమిని అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న ఆక్రమించుకున్నాడని గత ఎనిమిదేళ్లుగా ఆ భూమికోసం పోరాడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన జాటోత్ వీరన్న దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించుకుని దున్నుకుంటున్నాడని రైతు వెంకటరెడ్డి ఆ భూమివద్దకు వెళ్లి సెల్ఫీవీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మం తరలించగా మూడు రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి బుధవారం మృతి చెందాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకున్న రైతు వెంకటరెడ్డి పలువురిపై ఆరోపణ చేశాడు. గ్రామానికి చెందిన సురేష్, దేవిక, చిన్ని, ఉపేందర్, మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి ప్రోద్బలంతోనే జాటోత్ వీరన్న తమ భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించాడు. మృతుడు వెంకటరెడ్డికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు జాటోత్ వీరన్న, సురేష్, దేవిక, చిన్ని, ఉపేందర్, మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరెడ్డి గతంలో వీరన్న రూ.30వేలు అప్పు తీసుకుంటే దాన్ని అతడు రూ.3లక్షలు చేసి చూపి ఆ డబ్బు ఇవ్వాలని బెదిరిస్తు న్నాడని వెంకటరెడ్డి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు వీర న్నపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.



వెంకటరెడ్డి (ఫైల్)

26 కుంటల భూమి విషయంలోనే..

వెంకటరెడ్డి తమ్ముడు భూపాల్‌రెడ్డి భూమిని జాటోతు వీరన్న కొనుగోలు చేసి పక్కనే ఉన్న తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి 26 కుంటల భూమిని ఆక్రమించాడని వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇదే విషయమై ఇరువర్గాల వారు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టు పరిధిలో ఉంది. అయితే పోలీసులు తమపై కక్ష కట్టి వీరన్నకే మద్దతుపలుకు తూ ఎనిమిదేళ్లుగా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతు వెంకటరెడ్డి తాను పురుగుల మందుతాగే సమయంలో తీసుకున్న సెల్ఫీ వీడియోలో వివరించాడు. వెంకటరెడ్డి తమ్ముడు భూపాల్‌రెడ్డి కూడా వీరన్న వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని, వీరన్న మూలంగానే ఇద్దరు అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే ఈ విషయంపై ఖమ్మం రూరల్ ఎస్‌ఐ రామారావును వివరణ కోరగా భూతగాదా విషయంలో పోలీసులు ఎలాంటి పక్షపాతం వహించలేదన్నారు. ఆ విషయం కోర్టు పరిధిలో ఉందన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

● పోలీసుల సంతాపం

కల్లూరు, ఆగస్టు 7: కల్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోతురాజు వెంకటకృష్ణ (35) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కేన్సర్‌తో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఇటీవల హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతితో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు సంవత్సరాలుగా స్థానిక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ సహచర కానిస్టేబుళ్లతో, అధికారులతో మంచి గుర్తింపు పొందాడు. వెంకటకృష్ణ స్వగ్రామం ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం మృతదేహన్ని తీసుకొచ్చి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వ హించారు. ఈ మేరకు సమాచారం అందుకొన్న కల్లూరు ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్‌తో పాటుగా స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు వెంకటకృష్ణ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.



వెంకటకృష్ణ (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి..

దమ్మపేట, ఆగస్టు 7: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ముష్టిబండ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముష్టిబండ గ్రామానికి చెందిన చిలకా మల్లేష్ (50) మద్యానికి బానిసయ్యాడు. మల్లేష్‌ని భార్య మంగమ్మ మందలించటంతో మనస్థాపం చెంది సొమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం వైద్యశాల తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య పిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్

దుమ్ముగూడెం ఆగస్టు 7: మండల పరిధి లోని భైరాగులపాడు వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గా యపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవరు అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. దీంతో కారు అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న చర్ల రైస్‌పేటకు చెందిన కుప్ప విద్యారణ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ములకపాడు పీహెచ్‌సీకు తరలించి వైద్యచికిత్సలందించారు. బస్సులో సుమారు 56 మంది ప్రయాణీకు లుండగా అందరూ క్షేమంగా ఉన్నారు. ఎస్‌ఐ పోటు గణేష్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ డీఎం తిరుపతి, సీఐ గౌతమి, ఎస్ఎం అల్లం నాగేశ్వరావు సందర్శించారు.



ప్రమాదానికి కారణమైన బస్

యువకులపై దాడి ఘటనలో నలుగురి అరెస్టు

చుంచుపల్లి, ఆగస్టు 7: పోలీసులమంటూ యువకులపై ఇటీవల పెనగడప ప్రాంతంలో దాడి చేసిన నలుగురు వ్యక్తులను కొత్తగూడెం టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సంఘటనపై టూటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాలు.. ఈ నెల 4న కొత్తగూడెం పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై రీల్స్ వీడియోలు చేస్తున్నారు. ఈ క్రమంలో పెనగడప ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తూ ఆ రీల్స్ చేస్తున్న విద్యార్థుల వద్ద ఆగారు. మీరు ఎందుకు వీడియో, ఫొటోలు దిగుతున్నారని, మీరు గంజాయి బ్యాచ్‌కు చెందిన వారు అని అంటూ ఈ విద్యార్థులను మేము పోలీసులమంటూ బెదిరిస్తూ ఫోటోలు తీశారు. ఈ తీసిన ఫోటోలు డిలిట్ చేయాలంటే తమకు నగదును చెల్లించాలని అప్పుడే తొలగిస్తామని డిమాండ్ చేశారు. దీంతో ఈ ముగ్గురు విద్యార్థులు పోలీస్ ఐడి కార్డు చూపించండి అని అడగడంతో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు ఆ విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ విషయంపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు పెనగడప పంచాయతీ వారుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని వారు ప్రయాణించిన కారు, ఫోటో తీసిన



నింధితుల అరెస్టు చూపుతున్న సీఐ

మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్‌కె.యాకూబ్‌గౌరి, ఎగ్గడి అశోక్, వడ్డె మనోజ్, పులిచర్ల శరత్‌చంద్ర ఉన్నారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు, స్థానికులు ప్రధాన రహదారులపై, నిర్మానుష్య ప్రాంతాలలో ఫొటో షూట్స్, రీల్స్ వంటివి తీసుకోకూడదని హెచ్చరించారు. ఇలా తీసుకుంటున్న క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రమాదకరమైన వాగులు, నదులు, చెరువులు వద్దకు వెళ్ళి ఫోటోస్ దిగడం, రీల్స్ చేయకూడదని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


▸▸ వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు: మధిర సీఐ ▸▸ ఎర్రుపాలెంలో 780గ్రాముల గంజాయి పట్టివేత

మధిరటౌన్, ఆగస్టు 7: మాదకద్రవ్యాలు వాడినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని మధిర సీఐ డి. మధు హెచ్చరించారు. బుధవారం మధిరలోని ఆయన కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ఎర్రుపాలెం మండలం రెమిడిచర్ల రైల్వే అండర్ పాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ ద్విచక్రవాహనంపై మధిర కు వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనమానస్పదంగా ప్రవర్తించడంతో వారి వద్ద ఉన్న సంచీని తనిఖీ చేశామన్నారు. అందులోని 780 గ్రాములు గంజాయిని గుర్తించి దానిని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. నిందితులు మధిర కు చెందిన తమ్మిశెట్టి యేసుబాబు, రామిశెట్టి ఉపేందర్, భుక్యా అనుష్ నాయక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని జి. కొండూరు మండల కేంద్రం నుంచి మధిరలో విక్రయించేందుకు తీసుకువస్తున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు ముఖ్యంగా గంజాయి పట్ల ఇటీవల ఎక్కువగా యువత



మాట్లాడుతున్న సీఐ మధు

ఆకర్షితులు అవుతున్నారని తల్లిదండ్రులు పిల్లల నడవడికను కనిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం ఎస్‌ఐ పి. వెంకటేష్ పాల్గొన్నారు.



స్వచ్ఛదనం-పచ్చదనాన్ని పరిశీలించిన మునిసిపల్ ఉన్నతాధికారి

వైరా, ఆగస్టు7: వైరాలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మునిసిపల్‌శాఖ వరంగల్ ఆర్‌డీఎంఏ సాహిద్‌మసూద్ సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు, ఏఈ శంకర్, ఆర్ఐ ప్రదీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్.సైదులు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వెంకట్రావ్ పాల్గొన్నారు.



జోరువాన

- వాగులు పొంగటంతో గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- 17అడుగలకు చేరిన బేతుపల్లి చెరువు నీటిమట్టం
- పొంగి ప్రవహిస్తున్న ఆకేరు
- డోర్నకల్ ఖమ్మం రహదారి బంద్



వీఆర్ బంజర వంతెనపై బుగ్గవాగు ఉధృతి



కిష్టారం-చెరుకుపల్లి మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న ముగ్గువాగు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు6: జోరువానతో జనజీవనం స్తంభించింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాల్లో రాకపోకలు స్తంభించాయి. దమ్మపేట మండలం నుంచి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో బేతుపల్లి చెరువులోకి వరద నీరు భారీగా చేరగా 17 అడుగులకు నీటిమట్టం చేరింది. సుమారు 4800 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఎన్టీఆర్ కాలువ ద్వారా సత్తుపల్లి, వేంసూరు మండలాలకు నీరు సమృద్ధిగా చేరుతుంది. పట్టణంలోని సిద్దారం రోడ్డులో విశ్వేశ్వరరావు మిల్లు వద్ద నుంచి రాజీవ్ కాలనీ వరకు రోడ్డుపైనే వరద నీరు భారీగా చేరడంతో రాకపోకలు నిలిచాయి. కిష్టారం ఓసీ-పై-జంక్షన్ మధ్య అడవిలో నుంచి వచ్చే వరదనీరు రోడ్డుపై పారుతుండగా పీవో ఎంవీ.నరసింహారావు ఆధ్వర్యంలో ప్రొక్లెయిన్ సహాయంతో కాలువ తీయడంతో వాహనాల రాకపోకలు సాగాయి. గంగారం చెరువు పొంగడంతో రామానగరం నుంచి గంగారం మధ్య రాకపోకలకు సాయంత్రం వరకు ఆటంకం కలిగింది. కిష్టారం-చెరుకుపల్లి మధ్యలో ముగ్గువాగు, చెరుకుపల్లి- యాతాల కుంట మధ్య గిన్నెతోగు, యాతాలకుంట- దిబ్బగూడెం మధ్య కళంగి చెరువు వరద రోడ్డుపైనే ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేశారు. స్థానికులు వరద నీటిలో చేపలు పట్టడం కనిపించింది.

కల్లూరు - లక్ష్మీపురం రాకపోకల నిలిపివేత

కల్లూరు: కల్లూరు ప్రధాన జలసిరి పెద్దచెరువు అలుగు రెండోసారి పారుతుంది. చప్టానుంచి కల్లూరు టు లక్ష్మీపురం రహదారి విస్తరించి ఉంది. దీంతో అధికారులు బుధవారం నుంచి అధికారులు రాక పోకలను నిలిపి వేశారు. తహసీల్దార్ పి.సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, నీటిపారుదలశాఖ అధికారులు,ఎంపీవో సురేష్‌బాబు సందర్శించి పెద్దచెరువు అలుగు పారుదలను పరిశీలించారు. రాత్రిపూట గస్తీని ఏర్పాటు చేశారు.

వీఆర్ బంజర వంతెనపై బుగ్గవాగు ఉధృతి

రఘునాథపాలెం: డోర్నకల్ ఖమ్మం ప్రధాన రహదారిలో వీఆర్‌బంజర వంతెనపైకి బుగ్గవాగు వరద ప్రవహిస్తోంది. బుధవారం మధ్యాహ్నం నుంచి రవాణా సౌకర్యం బంద్ జరిగింది. డోర్నకల్ నుంచి ఖమ్మానికి రావాలంటే వీఆర్ బంజర బుగ్గవాగు వంతెనపై నుంచి రాకపోకలు జరగాల్సి ఉంటుంది. ఏటా వర్షాకాలంలో బుగ్గవాగు వంతెనపైకి భారీగా వరద వస్తోంది. రెండు రోజులుగా కారేపల్లి, కామేపల్లి ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురియటంతో బుగ్గవాగుకు వరద పోటు బాగా పెరిగింది. గరిడేపల్లి వీఆర్‌బంజర గ్రామాల మధ్య ఉన్న అండర్‌గ్రౌండ్ వంతెనపైకి వరద చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

అలుగుపోస్తున్న రాతోని

పెనుబల్లి: పెనుబల్లి రాతోని చెరువు సుమారు అడుగు మేర అలుగుపారుతుంది. టేకులపల్లి, కుప్పెన కుంట్ల మధ్య తెల్లసముద్రం చెరువు, పెనుబల్లి- గంగదేవిపాడు గ్రామాల మధ్య రాతోని అలుగువాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచాయి. రాకపోకలను నిలిపివేశారు. ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తకారాయిగూడెం-పాతకారాయిగూడెం గ్రామాల మధ్య రంగనాయకుల చెరువు అలుగు పారుతుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీవో ఉపేంద్రయ్య సిబ్బందితో నీటిని బయటకు పంపిస్తున్నారు.

పొంగి ప్రవహిస్తున్న ఆకేరు

తిరుమలాయపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలకు వర్షపునీరు చేరుతుంది.ఎగువప్రాంతంలో కురిసిన వర్షాలో ఆకేరు,పాలేరు నదుల్లోకి భారీగా వరద చేరింది. దీంతో ఆకేరు, పాలేరు నదులపై నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ తెలిపారు

కొత్తలింగాల-డోర్నకల్ రాకపోకలు నిలిపివేత

కామేపల్లి: బుగ్గవాగు ఉగ్రరూపంతో బండిపాడు వద్ద బుగ్గవాగుపై ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై వరద ప్రవహిస్తుండంతో డోర్నకల్ కొత్తలింగాల ప్రదాన రహదారిని అధికారులు నిలిపివేశారు. గరిడేపల్లి వీఆర్‌బంజర గ్రామాల మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి లోకి వరద నీరు రావడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వరద సహాయక చర్యల్లో ఎంపీడీఓ రవీందర్, తహశీల్ధార్ సుదాకర్ తదితరులు ఉన్నారు.

తనికెళ్ల ఉన్నత పాఠశాలలోకి వరద నీరు

కొణిజర్ల: బుధవారం రోజంతా ఎడతెరిపిలేకుండ వర్షంపడింది. మండలంలోని రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు పూర్తిగా నిండాయి. మండలంలోని తనికెళ్ళ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఆవరణంలో వరదనీరు చేరి పిల్లలకు ఇబ్బందికరణంగా మారింది. నీరు ఎటుపోయే పరిస్థితిలేక నీళ్ళన్ని పాఠశాల ఆవరణంలోనే నిలిచాయి.

పొంగి ప్రవహిస్తున్న మాచవరం వాగు

తల్లాడ: మాచవరం వాగు 2వ రోజు కూడా ఉధృతంగా ప్రవహించింది. మాచవరం వాగుపై ఉన్న వంతెనలు నీట మునిగాయి. దీంతో వరుసగా 2వరోజు బిల్లుపాడు-రామచంద్రాపురం, బిల్లుపాడు-కొత్తవెంకటగిరి ఆర్‌అండ్‌బి రహదారులలో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలో 23.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువనున్న జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో కూడా భారీవర్షం కురవడంతో మాచవరం వాగుకు వరద పోటెత్తింది. ప్రమాదకరంగా ఉన్న నీటమునిగిన వంతెనలపై రాకపోకలను మధ్యాహ్నం నుంచి నిలిపివేశారు.

వర్షంతో పలు డివిజన్లలో ప్రజలకు ఇబ్బందులు

ఖమ్మంసంక్షేమ విభాగం: వర్షంతో ఖమ్మంనగరంలోని పలు డివిజన్లలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 34వ డివిజన్‌లోని ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవటంతో ప్రజలకు రవాణా ఇబ్బంది ఎదురైంది. రాజేందర్‌నగర్ పాఠశాలలో వరద నీరు చేరటంతో కేఎంసీ సిబ్బంది మిషన్లు పెట్టి నీటిని బయటకు తోడారు. బ్యాంకుకాలనీ, జయనగర్, ప్రశాంతినగర్, ప్రకాశ్‌నగర్, త్రీ టౌన్‌లో ఖాళీ ప్రదేశాల్లో నీరు చేరి చేపల చెర్వలను తలపించాయి.

18.6 అడుగులకు చేరిన పాలేరు జలాశయం

కూసుమంచి:పాలేరు జలాశయం గరిష్ఠ నీటిమట్టం 18.6 అడుగులకు చేరుకుంది. సాగర్ డ్యామ్ ద్వారా ఎడమకాల్వకు 8000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, మొదటిజోన్ నుంచి పాలేరుకు 2500 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఎడమకాల్వ మొదటిజోన్‌కు మొదట 500 క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు క్రమేణా 2500 క్యుసెక్కులకు పెంచనున్నట్లు తెలిపారు.



యాతాలకుంటలో కళంగి చెరువు వరద



బండిపాడు వద్ద రాకపోకలు నిలిపివేత



పెనుబల్లి-గంగదేవిపాడు మధ్య పొంగుతున్న వాగు







మాచవరం వాగును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, కిష్టారం-చెరుకుపల్లి మధ్యలో ఏర్పాటుచేసిన భారీకేడ్లు, కల్లూరు పెద్దచెరువు అలుగును పరిశీలిస్తున్న అధికారులు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా: మాస్‌లైన్

వైరా, ఆగస్టు 7: కొత్తరేషన్‌కార్డులు, పింఛన్లు, ధరణి సమస్యలపై గురువారంఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలైన కొత్తరేషన్‌కార్డులు, పక్కాగృహాలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, ఇతర హామీలను అమలు చేయాలని డిమాడ్ చేశారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ

వైరా,ఆగస్టు7: వైరాలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాయితీపై బీటెక్ విద్యార్థి నివాస్‌కు ల్యాప్‌టాప్‌ను డాక్టర్ కాపా మురళీకృష్ణ బుధవారం అందజేశారు. పేద, నిరుపేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ తమవంతు సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తుందని మురళీకృష్ణ తెలిపారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు కొల్లా రాంబాబు, అబ్బూరి రమేష్, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, పెనుగొండ ఉపేంద్రరావు, వై.బుచ్చిరామారావు, తోటకూర శ్రీకాంత్, చింతోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అకాడమీలకు, ట్యూషన్ పాయింట్లకు అనుమతులు లేవు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు7:ఖమ్మం జిల్లాలోని మెడికల్ అకాడమీలకు, ట్యూషన్ పాయింట్లకు తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అనుమతులు లేవని ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు బుధవారం తెలిపారు. విద్యార్థులు తల్లితండ్రులు అనుమతులు లేని కళాశాలల్లో అడ్మిషన్లు పొందవద్దని, ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన ఇంటర్ కళాశాలల్లోను చేరాలని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేస్తే యాజమాన్యంపై శాఖపర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మల్లెమడుగులో విద్యాప్రవేశ్ సర్వే

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు7: పాఠశాల సంసిద్ధత కార్యక్రమ అమలుపై అంచనా వేసేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజాపాటిల్ బుధవారం నగరంలోని మల్లెమడుగు ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహించారు. పాఠశాల ప్రార్థనా సమయం నుంచి పాఠశాల ముగిసే వరకు జరిగే ప్రతి ప్రక్రియను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్, ఎంఈఓ రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు వెంకన్న కన్నుమూత



ఖమ్మంరూరల్,ఆగస్టు7: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పాలేరు నియోజకవర్గ బీబ్లాక్ మాజీ అధ్యక్షుడు, మంగళగూడెం మాజీసర్పంచ్ కన్నేటి వెంకన్న (60) అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న మృతి విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పాలేరు మాజీఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఎంపీ రఘురాంరెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎలక్ట్రీషియన్‌కు ఆర్థికసాయం

పెనుబల్లి, ఆగస్టు 7: పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ షేక్.లతీఫ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. కుటుంబసభ్యులకు బుధవారం తోటి ఎలక్ట్రీషీయన్లు రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు గోవర్థన్, వాకా మధు, వంగా శ్రీనివాసరావు, అనిల్, వంశీ, గోపి పాల్గొన్నారు.

దివ్యాంగుల రిలే నిరాహార దీక్షలు

నేలకొండపల్లి, ఆగస్టు7: దివ్యాంగుల ఆత్మ గౌరవం దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో బుధవారం నుంచీ రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు చలమయ్య మాట్లాడుతూ స్మితా సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

ఖమ్మం కానాపురంహవేలి ఆగస్టు 7: పెట్టుబడులు, అధికలాభాల ముసుగులో సైబర్ కేటుగాళ్లు వేసే వలలో పడి మోసపోవద్దని సైబర్‌క్రైమ్ ఏసీపీ సీహెచ్ ఆర్‌వి.ఫణిందర్ అన్నారు. బుధవారం నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సైబర్ మోసాలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ బాలకృష్ణ, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



ఖమ్మంక్రైం, ఆగస్టు7: అనారోగ్యంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎండీ అబ్దుల్ మునీర్ (48) కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు ఈనేపథ్యంలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న హోంగార్డు ఆర్ఐ ఎం.సురేష్ మృతుని ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొణిజర్ల,ఆగస్టు7: మండల పరిధిలోని తనికెళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా తూనిక, కొలతల అధికారి విజయకుమార్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సంతృప్తిని వ్యక్తం చేశారు. కష్టపడి చదువుకోవాలన్నారు.

పగిడేరుపై బ్రిడ్జిని నిర్మించాలి

కొణిజర్ల,ఆగస్టు7: మండలంలోని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న తీగలబంజర వద్ద పగిడేరు వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీవై పుల్లయ్య,అర్జున్‌రావు, పాశం అప్పారావు, సీతారాములు, అశోక్, యల్లారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కమతం కన్నుమూత



కొణిజర్ల, ఆగస్టు7: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కమతం నరసింహరావు(75) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. అతడు తొలుత సీపీఐలో తర్వాత టీడీపీలో పని చేశారు. పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ కమటాల రేణుక, సీపీఐ నాయకులు పీవీరావు నివాళులు అర్పించారు. మృతుడి నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి అందించారు.

పలువురికి ఏఈఈ ఉద్యోగాలు



ఉపేంద్ర

వైరా, ఆగస్టు7: మండలంలోని పాలడుగులో నిరుపేద కుటుంబానికి చెందిన మోదుగు ఉపేంద్ర మిషన్ భగీరథ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా(ఏఈఈ) ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు శ్రీను, కోటమ్మతోపాటు హోంగార్డు అయిన బాబాయి మోదుగు కృష్ణ ప్రోత్సాహంతో చదువుల్లో రాణించేవాడు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, అతర్వాత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు అక్కడే విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు.



శ్రీమన్య

చింతకాని: మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన గుర్రం శ్రీమన్య ఏఈఈ కొలువు సాధించింది. ఇటీవల ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో ఆమె రాష్ట్రంలో 194వ ర్యాంకు సాధించి పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈ పోస్టుకు ఎంపికైంది. శ్రీమన్య ప్రస్తుతం మణుగూరు సింగరేణి కాలరీస్ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. శ్రీమన్య పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపక పరీక్ష ఫలితాల్లో 79వ ర్యాంకు, ఏఈ పరీక్ష ఫలితాల్లో 475వ ర్యాంకు సాధించింది. ఆమెను తల్లితండ్రులు గుర్రం నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మీ అభినందించారు.

నిల్వ నీరు బయటకు తరలింపు

కల్లూరు, ఆగస్టు7: కల్లూరులో ప్రధాన రహదారులపై జనావాసాల మధ్య వదర నీరు నిల్వ ఉండగా బుధవారం కాల్వలోకి మళ్లించారు. గ్రామ పంచాయిదా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్ ఎంపీవో సురేష్‌బాబు పర్యవేక్షించారు. స్థానికంగా విద్యానగర్, అంబేద్కర్ నగర్, యుపీఎస్ రహదారుల వైపున జనావాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండగా నీటిని తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపరిశుభ్రతతోనే వైరల్ వ్యాధులు

డీఎంహెచ్.డీసీఎచ్.ఎస్.డీఎల్‌పీవో

రఘునాథపాలెం, ఆగస్టు7: జిల్లా వైద్యఆరోగ్య, పంచాయతీ అధికారుల బృందం బుధవారం రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో వర్షంలోను పర్యటించారు. జిల్లావైద్యాధికారి మాలతి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, డీఎల్‌పీవో ప్రభాకర్ ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు పారిశుద్యం, జ్వరాలు తగ్గిన తర్వాత కనిపించే శరీర మార్పులపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రతతోనే దోమల వ్యాప్తి చెందుతాయని, వైరల్ వ్యాధులు వస్తాయని ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ హాస్పటల్ నుంచి ప్రత్యేకంగా మందులు తెప్పించి పంపిణీ చేయిస్తామని తెలిపారు. ఎంపీడీవో అశోక్ కుమార్, మండల వైద్యాధికారి శ్రీదేవి, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, వైద్యపర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, పద్మ, కృష్ణయ్య, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు వైరా ఎమ్మెల్యే పరామర్శ

కారేపల్లి, ఆగస్టు7: మండల పరిధిలోని మృతుల కుటంబాలను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ బుధవారం పరామర్శించారు. విశ్వనాధపల్లి గ్రామంలో మంగళవారం రాత్రిమృతిచెందిన తోటకూరి నాగయ్య, సోమవారం మృతి చెందిన ఎడారి వెంకటరమణ కుటంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మూత్యాలగూడెం గ్రామంలో మృతిచెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మండలపార్టీ మాజీ అధ్యక్షుడు పునెం రాజు కుంటుబసభ్యును పరామర్శించారు. రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు.

వర్షంలోనే మధ్యాహ్న భోజనం తయారీ

కొణిజర్ల, ఆగస్టు7: పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కడుపు నింపుతున్న మధ్యాహ్నభోజన వర్కర్‌ల ఇబ్బందులు అంతా ఇంతకావు. వర్షంలో తడుస్తూ విద్యార్థులకు భోజనాన్ని తయారు చేస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదని, నెలనెలా ఇవ్వాల్సిన బిల్లులను కూడా ఇవ్వడంలేదని విమర్శలు వస్తున్నాయి. బుధవారం మండల పరిధిలోని తనికెళ్ళ ఉన్నత పాఠశాలలో మధ్నాహ్న భోజన కార్మికులు వర్షంలోనే భోజనం తయార చేశారు. వారి గోడును 'ఆంధ్రజ్యోతి' ఎదుట వెళ్లబోసుకున్నారు. కిచెన్‌షెడ్డు మొత్తం కురుస్తుందని, చుట్టూ ఏమిలేకపోవడంతో జల్లుమొత్తం వస్తుందని, వంట తయారు చేయటానికి స్థలంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బయట వండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



మరుగుదొడ్డి వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



వైఎస్‌ఆర్ నగర్‌లో పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఆగస్టు7: వైఎస్‌ఆర్ నగర్‌లోని రెండు పడకల నివాసాల్లో నుంచి వచ్చే మరుగుదొడ్డి వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కేఎంసీ కమిషనర్ అబిషేక్ అగస్త్య అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఆదేశించారు. బుధవారం 8వ డివిజన్‌లో కమిషనర్ కేఎంసీ అధికారుల బృందంతో కలిసి పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ రెండు పడకల గదుల ఇళ్లలో పారిశుధ్య సమస్యలు, వీధుల పేర్ల బోర్డులు, పారిశుద్య కార్మికుల కొరతపై విన్నవించారు. దీంతో స్పందించిన కమిషనర్ వెంటనే వైఎస్‌ఆర్ కాలనీలో రీసైక్లింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తర్వాత జిల్లా హాస్పటల్‌లో డెంగూ వ్యాధితో వైద్యసేవలు పొందుతున్న 43వ డివిజన్ మహిళ వద్దకు వెళ్లి డెంగూకు వ్యాప్తికి గల కారణాలను కమిషనర్ స్వయంగా తెలుసుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ఏన్కూరు, ఆగస్టు7: ఆర్‌బీఎస్‌కే, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. విద్యార్థుల ఎత్తు, బరువులను కొలిచారు. అవసరమైన వారికి మందులను అందించారు.

గతం కంటే తగ్గిన వరద పోటు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు7: గంట పాటు వర్షం పడిందంటే వైరా రోడ్డులో వాహనదారులకు వరద గండమే కనిపించేది. మయూరిసెంటర్ నుంచి జెడ్పీ సెంటర్, ప్రభుత్వ హాస్పటల్ నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు, ఐటీ హబ్ నుంచి ఇందిరానగర్ సెంటర్ వరకు ప్రదాన రహదారి వాగును తలపించేలా వరద పోటు ఉండేది. రోడ్లపై అభివృద్ధి మేరుగులు దిద్దిన పాలకులు రోడ్డు సైడ్ డ్రైన్‌లపై దృష్టి పెట్టలేదు. అయితే జూన్ మాసం మొత్తం ప్రత్యేక డ్రైవ్‌గా కేఎంసీ అధికారులు తీసుకున్నారు. ముందస్తు వ్యూహంతో చేసిన పనులు ఇప్పుడు కొంత వరద పోటును తగ్గించాయి. నీటి నిల్వ ప్రాంతాలు, ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైన్‌లోని అడ్డుపడిన వాటిని తొలగించేందుకు జూన్‌లో ప్రత్యేకడ్రైవ్ చేపట్టారు. వయూరి సెంటర్ వంతెన కింద ఉన్న డ్రైన్‌ను క్లీన్ చేయించారు. పాతబస్టాండ్ నుంచి బాబురావు పెట్రోల్ బంకు వరకు అండర్ డ్రైన్‌లో వ్యర్థాలు, సిమెంట్ బిల్లలు, అక్రమంగా నిర్మాణాలను తొలగించారు. ఐటీహబ్ సెంటర్‌లో అండర్ గ్రౌండ్‌లో మూడు సిమెంట్ దిమ్మెలు పడి రహదారిపైకి వరద రావటంతో ఒక రోజంతా పనిచేసి వాటిని తొలగించారు. టీటీడీసీ సమీపంలో ఒక సీసీ రహదారి అండర్ డ్రైన్‌కు అడ్డుగా ఉండటంతో దానిని ధ్వంసం చేసి డ్రైనేజీ శుభ్రం చేశారు. నీటి నిల్వలు అధికంగా ఉండే ప్రాంతాల్లో 20 మంది డీటీఎఫ్ టీంలను ఏర్పాటు చేసి రోజుకు మూడు డివిజన్లు చొప్పున డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించారు. దీంతో రెండు రోజులుగా కురుస్తున్నా గతం కంటే కొంత మేరా బెటర్ అనే రీతిలో ఖమ్మంలోని ప్రధాన రహదారుల్లో వాహనదారులకు కొంత ఉపశమనం కలిగింది.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి ఆగస్టు 7: గురుకులాల్లో పని చేసే ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులను సొంత పిల్లలుగా బావించి వృత్తి పట్ల నిబద్దత, అంకితభావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని అల్లిపురం రోడ్‌లోని తెలంగాణ మైనారిటీగురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. గురుకుల పరిసరాలు, తరగతి గదులు, మూత్రశాలలు, డార్మిటరీబ్లాక్, వంటగది, వంట సరుకులు తదితర పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మద్యాహ్న భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశద్ధ తీసుకోవాలని బాద్యులను ఆదేశించారు. పాఠశాలలఆవరణలో ఎప్పుడు పరిశుభ్రంగా ఉండాలని, రాత్రి పూట విద్యార్థులు బైటకురాకుండా పర్యవేక్షకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండి సాయంత్రం సమయాల్లో వెనెకబడిన పిల్లకు ప్రత్యేకంగా బోధించి సందేహలను నివృత్తి చేయాలని సూచించారు. తరగతి గదిలోకి వెళ్ళీ విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాలకు వెళ్ళే అప్రోచ్ రోడ్‌కు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మిర్నల్‌శ్రేష్ఠ, గురుకుల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.